క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



మేడిపల్లి: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు అండగా ఉంటాయని మంత్రి మల్లారెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డితో కలిసి పలువురు లబ్దిదారులకు బుధవారం చెక్కులను పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మధురం.. త్యాగరాజ కీర్తనలు



గౌతంనగర్: త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవంలో భాగంగా హనుమాన్‌పేట్ కమ్యూనిటీ హాల్‌లో చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పంచరత్న సేవా, త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. చైతన్య మహిళా మండలి సభ్యులుపాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



రామంతాపూర్: వెంకట్‌రెడ్డినగర్‌లోని కన్యాకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం పార్వతి పరమేశ్వరులు, సీతారామచంద్రమూర్తుల కల్యాణ మహోత్సవాన్ని వేద పడింతుల మంత్రోచ్చరణ మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా, అధ్యక్షులు వెంకటేశం, ప్రధాన కార్యదర్శి సత్యనారయణ, కోశాధికారి కొండయ్యగుప్తా, నగేష్‌గుప్తా, భిక్షపతిగుప్తా, ప్రధాన సలహాదారులు పాండయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన మహోత్సవం



అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని హనుమాన్ సర్కిల్ కొత్తబస్తీలో శాంతి స్వరూప ఆంజనేయస్వామి దేవాలయంలో పునర్ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబితకిషోర్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు ప్రేమ్‌కుమార్, కరుణానిధి, నీలేష్, మదన్‌కుమార్, విట్టల్‌రావు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించాలి



రఘునందన్‌రావుతో జేఏసీ ప్రతినిధులు

బోడుప్పల్: బోడుప్పల్ వక్ఫ్ బాధితుల జేఏసీ ప్రతినిధులు బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావును కలిసి తమ ఇంటి స్థలాల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. 40 ఏళ్ల క్రితం కొనుక్కొని ఇళ్లు నిర్మించుకున్న స్థలాలను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు స్థలాలంటూ రిజిస్ట్రేషన్లు, ఇంటి అనుమతులను నిలిపివేసిందన్నారు. వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని వివరించారు. అసెంబ్లీలో ప్రస్తావించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. బీజేపీ నాయకులు కొంపల్లి మోహన్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, వివిధ కాలనీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

మల్లాపూర్: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. నాచారం రాఘవేంద్రనగర్ కాలనీలో రూ.20 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, మేకల ముత్యంరెడ్డి, కట్ట బుచ్చన్నగౌడ్, అజ్మరీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో తిరుగుబావుటా

మంత్రి మల్లారెడ్డి ఆదేశాలను ఖాతరు చేయని సొంత పార్టీ కార్యకర్తలు

అధికార పార్టీ బీఆర్‌ఎస్‌లో తిరుగుబాటు జెండా ఎగురుతోంది. నగర పాలక సంస్థ, మున్సిపాలిటీల్లో సొంత పార్టీ మేయర్లు, చైర్మన్ల పైనే అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసులు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు అందజేయడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.

- తాజాగా దమ్మాయిగూడ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం
- 14 మంది కౌన్సిలర్లు కలిసి కలెక్టరేట్‌లో నోటీసు అందజేత
- జవహర్‌నగర్, మేడ్చల్ పురపాలికల్లోనూ తిరగబడిన సొంత పార్టీ సభ్యులు
- మేడ్చల్ నియోజకవర్గంలో మరో 4 పురపాలికల్లో ఇదే పరిస్థితి
- ఇటీవల జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు కూడా...
- అసమ్మతి వాదుల బుజ్జగింపు పర్వానికి తెరలేపిన మంత్రి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలు ఉండగా, మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు ఆయన ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసులు సమర్పించడంపై బీఆర్‌ఎస్ కేడర్‌ను తీవ్ర అయోమయానికి గురిచేస్తోంది. సొంత బంధువులు ప్రాతినిధ్యం వహిస్తున్న పురపాలక సంఘాల్లో కూడా కౌన్సిలర్లు మంత్రి మల్లారెడ్డి గీత దాటడంతో పాటు విపక్షాలతో చేతులు కలపడం వంటి విషయాలు రాజకీయ వర్గాలను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రాష్ట్రంలోనే అత్యధిక పురపాలక సంఘాలు కలిగిన శాసన సభా నియోజకవర్గంగా మేడ్చల్‌కు పేరుంది. ఇక్కడనే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి ఆదేశాలను బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పాటించక పోవడంతో పట్టును కోల్పోతున్నారన్న చర్చ పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అలాగే మేడ్చల్ నియోజకవర్గంలోని పలు పురపాలక సంఘాలకు చెందిన డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కూడా అదే పార్టీకి చెందిన మేయర్లు, చైర్మన్లపై అవిశ్వాసం నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన మంత్రి మల్లారెడ్డి వివిధ మార్గాల ద్వారా అసమ్మతి వాదులను బుజ్జగించే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. బుధవారం 'మన ఊరు–మన బడి' కింద మరమ్మతులు పూర్తయిన ప్రభుత్వ పాఠశాలల భవనాల ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి మల్లారెడ్డి పోచారం, పీర్జాదిగూడ, బోడుప్పల్ పురపాలక సంఘాల్లోని అసమ్మతి వాదులతో సమావేశమై.. బుజ్జగింపుల పర్వానికి తెరలేపినట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కూడా...

మంత్రి మల్లారెడ్డిపై దాదాపు నెల రోజుల కిందట మల్కాజిగిరి ఎమ్మెల్యే, సీనియర్ బీఆర్‌ఎస్ నేత మైనంపల్లి హన్మంతరావు ఇంట్లో సమావేశమైన జిల్లాకు చెందిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు పలు ఆరోపణలతో తిరుగుబావుటా ఎగురవేసిన విషయం తెల్సిందే. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలను ఖాతరు చేయకుండా నామినేటెడ్ పదవులను మంత్రి మల్లారెడ్డి సొంత నియోజకవర్గం వారికి కట్టబెట్టారని ఎమ్మెల్యేలు ఆరోపించారు. అలాగే తమ నియోజక వర్గాల్లో అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు విషయంలో కలెక్టర్‌ను మంత్రి పక్కదారి పట్టిస్తున్నారని ఎమ్మెల్యేలు విమర్శిస్తున్నారు. మంత్రి మల్లారెడ్డి వ్యవహార శైలిపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యేలు అప్పట్లోనే మీడియా సమావేశంలో ప్రకటించారు.



దమ్మాయిగూడ చైర్‌పర్సన్‌పై కలెక్టరేట్‌లో అవిశ్వాసం నోటీసును అందజేస్తున్న కౌన్సిలర్లు

జవహర్‌నగర్ బాటలో మరికొన్ని..

మేడ్చల్ నియోజకవర్గంలోని జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్యపై 20 మంది కార్పొరేటర్లు ఇటీవల కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ మర్రి దీపికపై 15 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం తీర్మానానికి సంబంధించిన నోటీసు కలెక్టర్ కార్యాలయంలో అంద జేశారు. తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్ 2019 సెక్షన్ 37 అనుసరించి నో కాన్ఫిడెన్స్ మోషన్ పిటిషన్ చైర్మన్‌కు వ్యతిరేకంగా సమర్పిస్తున్నట్లు వారు నోటీసులో పేర్కొన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మరో 4 పురపాలక సంఘాలకు చెందిన అధికార బీఆర్‌ఎస్‌కు చెందిన అసమ్మతి కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీసులు కలెక్టర్‌కు అందజేసేందుకు సిద్ధమవుతున్నారు.

తాజాగా దమ్మాయిగూడలో ...

మేడ్చల్ నియోజకవర్గంలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీకి చెందిన 14 మంది కౌన్సిలర్లు బుధవారం చైర్‌పర్సన్ ప్రణీతపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసును కలెక్టర్‌కు అందజేశారు. నోటీసుపై సంతకం చేసిన వారిలో 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10, 12, 16, 17, 18 వార్డులకు చెందిన కౌన్సిలర్లు ఉన్నారు. నోటీసు ఇచ్చిన ఆ 14 మంది కౌన్సిలర్లలో ముగ్గురు కాంగ్రెస్ వారు కాగా, మిగతా 11 మంది కౌన్సిలర్లు అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారే కావడం విశేషం. వీరంతా మంగళవారమే కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వెళ్లగా సమయం దాటి పోవడంతో బుధవారం అందజేశారు. అలాగే, రాంపల్లి దాయార ప్రాంతంలోని ఒక గార్డెన్‌లో సమావేశమైన దమ్మాయిగూడ మున్సిపాలిటీకి చెందిన అసమ్మతి కౌన్సిలర్లు అవసరమైతే రాజీనామాలకు కూడా సిద్ధపడాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా..



అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

- సర్కారు బడులకు హంగులు
- మంత్రి చామకూర మల్లారెడ్డి
- అభివృద్ధికి రూ.24.50 లక్షలు

మేడిపల్లి: సర్కారు స్కూళ్లను సమగ్రంగా మార్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన ఊరు–మన బడి మొదటి విడత కార్యక్రమంలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కమలానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి మల్లారెడ్డి, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి సుమారు రూ.24.50 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు సరైన సౌకర్యాలు లేక కళ తప్పిన సర్కారు బడులు, నేడు అన్ని వసతులు, సౌకర్యాలతో కొత్తగా రూపుదిద్దుకుంటున్నాయన్నారు. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా సరికొత్త హంగులను అద్దుకున్నాయన్నారు. అనంతరం మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యకు పెద్దపీట వేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, డీఈఈ శ్రీనివాస్, ఏఈ వినీల్ గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానకి, ప్రధానోపాధ్యాయులు ఎల్.సత్యప్రసాద్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు కేటాయించడంలో ప్రభుత్వం విఫలం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: రాష్ట్రంలో డబుల్ ఇళ్ల కేటాయింపు, దళితబంధు పథకం అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి విమర్శించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం హెచ్‌బీకాలనీ, ఇందిరానగర్ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రేపు మాపు అంటూ డబుల్ ఇళ్ల కేటాయింపును వాయిదా వేస్తూ వస్తున్న ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఇక దళితబంధు పథకానికి పూర్తిగా రాజకీయ రంగు పులిమి కేవలం బీఆర్‌ఎస్ పార్టీ వారికి మాత్రమే పథకాన్ని పరిమితం చేశారని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మరోమారు ప్రజలను మోసం చేసేందుకు సీఎం కేసీఆర్ కుట్ర పన్నుతున్నాడని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీఆర్‌ఎస్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోలేపాక అంజయ్య, సంజీవరెడ్డి, మేడల మల్లికార్జున్‌గౌడ్, యాకుబ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అస్వస్థతకు గురైన పార్టీ సీనియర్ నేత జలగం వెంకటేశంను ఆయన పరామర్శించారు.



హెచ్‌బీకాలనీలో మహిళలతో మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి

విద్యార్థుల మధ్య గొడవ

- పరస్పర దాడులకు పాల్పడ్డ విద్యార్థులు
- గస్తీ ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు



కమలానగర్‌లో ఘర్షణ పడుతున్న విద్యార్థులు

కుషాయిగూడ: ఈసీఐఎల్ పరిసర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో కళాశాలలు ఉన్నాయి. ముఖ్యంగా సౌత్ కమలానగర్‌లో వీధికో కళాశాల ఉంది. ఈ క్రమంలో విద్యార్థులు ఉదయం, సాయంత్రం రోడ్ల వెంట గుంపులుగా ఉండటం, సిగరెట్లు తాగడం, బైక్‌లపై అమ్మాయిల పక్క నుంచి వారు భయపడేలా రయ్‌మని వెళ్లడం వంటి ఘటనలు ఇక్కడ నిత్యకృత్యాలు. ఇక రెండు మూడు రోజులకోసారి గ్యాంగ్‌వార్‌లు కూడా మాములే. ఒక్కసారిగా వందల మంది విద్యార్థులు గ్యాంగ్‌లుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ పడటం తరచూ జరుగుతూనే ఉంటుంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం కళాశాలలు వదలగానే కమలానగర్‌లో సీఎంఎస్ కళాశాల, శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు గ్యాంగులుగా ఏర్పడి పరస్పరం దాడులకు పాల్పడ్డారు. కొంత మంది విద్యార్థులను ఉరికిస్తూ దాడికి పాల్పడ్డ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఘటన స్థలంలో ఉన్న కొంతమంది వారిని వారించడంతో అక్కడి నుంచి వారు వెళ్లిపోయినట్లు తెలిసింది. జరగరానిది ఏమైనా జరిగితే బాధ్యులెవరంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కళాశాల యజమాన్యాలు, తల్లిదండ్రులు విద్యార్థుల ప్రవర్తన పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు. పోలీసులు కూడా కఠినంగా వ్యవహరిస్తేనే ఇలాంటి ఘటనలు పునరావృత్తం కావంటున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్రం.. దేశంలోనే నెంబర్ వన్



మంగాపురంలో ఆలయ ముఖద్వార పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కుషాయిగూడ: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశంలోనే రాష్ట్రం నెంబర్ వన్‌గా నిలిచిందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ మంగాపురం, కృష్ణానగర్ కాలనీల్లో రూ.50 లక్షలతో నిర్మించ తలపెట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులకు బుధవారం స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా కోట్ల రూపాయాలతో ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం పి.సంతోష్ కుమార్, డీజీఎం సతీష్, ఏఈ వేణుగోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ, సుఖేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖ ద్వార పనులు ప్రారంభం

మంగాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ముఖ ద్వారం పనులను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. మల్లేష్‌గౌడ్, సమ్మని మురళీచారి, సముద్రాల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కాప్రాలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

అభివృద్ధిలో ఆదర్శం

కాప్రా: సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిలోనూ రాష్ట్రం ఆదర్శంగా ఉందని ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. కాప్రా డివిజన్‌లో పర్యటించిన ఆయన సుమారు రూ.90 లక్షలకుపైగా వ్యయంతో చేపట్టనున్న పనులకు బుధవారం భూమిపూజ చేశారు. ఎన్నారై కాలనీలో రూ.41.90 లక్షలతో చేపట్టనున్న కాంపౌండ్ వాల్, ప్లేఎక్విప్‌మెంట్స్, వాకింగ్‌ట్రాక్ పనులకు భూమిపూజ చేశారు. శ్రీరాంనగర్ కాలనీలో రూ.20.80 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, బాలాజీ ఎన్‌క్లేవ్‌లో రూ.8.70 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్పొరేటర్ స్వర్ణరాజ్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్‌ఎస్ నాయకులు ఎం.కె.బద్రోద్దీన్, సూడుగు మహేందర్‌రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి, కుమార్, పాండుగౌడ్, మహ్మద్ గౌస్ ఉన్నారు.

రెండు నెలలకు ఒకసారి మీటర్ రీడింగ్‌తో అధిక బిల్లు

బోడుప్పల్: ఎంఎల్‌ఆర్ కాలనీలో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆ కాలనీ ప్రతినిధులు ఏఈకి వినతి పత్రం అందజేశారు. లో ఓల్టేజీతో విద్యుత్ హెచ్చుతగ్గులు ఉంటాయని, అలాగే రెండు నెలలకు ఒకసారి కరెంట్ రీడింగ్ తీస్తున్నారన్నారు. దీంతో విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని వినతి పత్రంలో కోరారు. ఎంఎల్‌ఆర్ కాలనీ అధ్యక్షుడు పి.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కళ్యాణ్‌కుమార్‌రెడ్డి, కోశాధికారి అశోక్ రెడ్డి కాలనీవాసులున్నారు.



కంటి పరీక్షలకు అన్ని సౌకర్యాలు



కంటి వెలుగులో కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

బోడుప్పల్: బీఎల్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం మేయర్ సామల బుచ్చిరెడ్డి ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కార్పొరేటర్లు చీరాల నర్సింహ, సింగిరెడ్డి పద్మారెడ్డి, నాయకులు గుర్రాల వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్

మల్లాపూర్: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. సీఈఓ స్వామి, గ్రేటర్ బీఆర్‌ఎస్ నేత సాయిజెన్‌శేఖర్, విఠల్‌యాదవ్, రాజబాబు, డాక్టర్లు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగి ఆత్మహత్య

అల్వాల్: కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. టెలికాం కాలనీ క్రిష్ణమ్మ ఎన్‌క్లేవ్‌లో నివాసముండే టి.ప్రసాద్(56) ఎల్‌ఐసీ ఏజెంట్. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పార్థల కారణంగా భార్య దూరంగా ఉంటోంది. దీంతో మనస్తాపం చెందిన ప్రసాద్ బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

15 రోజుల్లో పనులు పూర్తి చేయండి

అల్వాల్: నాలా నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ ఎస్‌ఈ చిన్నారెడ్డి అన్నారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని తిరుమల ఎన్‌క్లేవ్‌లో కొనసాగుతున్న బాక్స్‌టైప్ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రహదారి కావడంతో ప్రయాణికులకు అసౌకర్యం ఏర్పడుతోందన్నారు. పనుల్లో వేగం పెంచి 15 రోజుల్లో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బీహెచ్‌ఈఎల్ నుంచి మల్లారెడ్డి కాలనీకి బాక్స్‌టైప్ డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రతిపాదనలను పంపాలని అధికారులకు సూచించారు. ఈఈ రాజు, డీఈ మహేష్, ప్రశాంతి తదితరులు ఉన్నారు.



అల్వాల్‌లో బాక్స్‌టైప్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

నియామకం

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గ మైనార్టీ మోర్చా కన్వీనర్‌గా నాచారం ప్రాంతానికి చెందిన మహ్మద్ అన్వర్ నియమితులయ్యారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ నియామకపు ఉత్తర్వులను బుధవారం అందజేశారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మల్కా ప్రకాష్, పద్మారెడ్డి, గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, బీజేపీ అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు అన్వర్ ఉన్నారు.



వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని కాశీపురంలో శాన్వి ప్రైడ్‌హోమ్స్‌లో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణదారులు జీఎల్. మహేష్‌కుమార్, సురేష్‌కుమార్, డెవలపర్ ఎం.కృష్ణారెడ్డిల సహకారంతో సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఉదయం నుంచి యజ్ఞం, హోమాలను వేద పండితుల సమక్షంలో నిర్వహించారు. సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్లు రాజ్‌జితేంద్రనాథ్, శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబితాకిషోర్ హాజరవుతారని తెలిపారు.



సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి

గౌతంనగర్: సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి కలుగుతుందని మాజీ సైనికుడు పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం మిర్జాల్‌గూడ రాజానగర్‌లోని ఆయన నివాసంలో పేద మహిళలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మల్లికార్జుననగర్‌లో అన్నదానం మల్లికార్జుననగర్‌లో స్థానిక నివాసి సుందర్‌రాజన్ ఆధ్వర్యంలో పేదలు, జీహెచ్‌ఎంసీ కార్మికులకు అన్నదానం నిర్వహించారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తూ..